# అశ్వగండం

(కథానిక)

ఇన్స్పెక్టరు నందకిశోరరావు, మిత్రుడు సింహాద్రిరావు పొద్దుటిపూట ఉపాధ్యాయులు తెచ్చి యిచ్చే కాఫీ ఫలహారాల కోసం ఆత్రపడుతున్నారు. వాళ్లు తేగా మిత్రులిద్దరూ రుచిచూశారు. ఇన్స్పెక్టరు లేచివెళ్ళి ఏవో ఆఫీసు కాగితాలు చూసుకొంటున్నారు.

సింహాద్రిరావు చాపమీద నడుంవాల్చి, బీడీ ముట్టించాడు. నిన్నటి ఘటన — అంటే, బండి బోల్తాపడ్డ విషయం జ్ఞాపకం రాగా అతని ఒళ్లు జలదరించింది. బండి పేరు చెప్పితే గాబరా పడుతున్నాడు. "ఏదో నా పెళ్ళాం అదృష్టం బాగుంది. పిల్లలమాటకేమి రెక్కలు వస్తే వాళ్ళంతట వాళ్లే బతుకుతారు. దాని మెడలో తాడు బలమే నన్ని గండంనుంచి కాపాడిందని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పవచ్చు. లేకుంటే అప్పుడే ఇది రెండోరోజు. ఒకవేళ ఆ బండి తిరగబడిపోయినపుడు, నా నడుం కనక విరిగి పోయుంటే, ఇహ వీడినెక్కడ మోసుకెళ్ళగలమని, వీళ్లు ఆ అడవిలో అక్కడే పారవేసి ఉంచేవారు. రాత్రి ఏ పెద్దపులో దారిని పోతూ, నరవాసన తగిలి, వెనక్కు వచ్చి గుటకాయస్వాహా చేసిఉండేది; దానికేమి దయాదాక్షిణ్యమా? నరమానవులకే లేనిది, దానికా ఇహ వచ్చింది. నా పిల్లలు దిక్కులేని పక్షులయిపోయుండురు. ఇంతకీ నాకు భూమిమీద నూకలున్నాయి. కాబట్టే తప్పిపోయింది. సధ్యా చెప్పవచ్చిందేమిటంటే— ఈ అడివిలో దిక్కో మొక్కో? అంచేత జన్మజన్మాలకీ బండి యెక్కదలచుకోలేదు. దానికంటే పెద్దపులే నయం! అది చంపేస్తే ఒకమాటు పీడ వదిలి పోతుంది. మరి యిదో ఏ నడుమో విరిగిందంటే, తీసుకు తీసుకు చావాలి" అని మనస్సులో విచారించి "ఏమిటి సాధనం?" అని సతమతమవుతున్నాడు. బీడీ పొగ గుమ్మగా వదులుతున్నాడు. ఇంతటిలో ఏదో గుర్రపు సకిలింత చెవిని బడింది. విచిత్రపడి వీథిలోకి వెళ్ళి చూశాడు. గుర్రంమీద ఒక బాటసారి వెళుతున్నాడు. అతనివెంట పిల్లలు కేరింతాలు కొడుతున్నారు. మేష్టర్లు కూడ ఇవతలకి వచ్చి చూశారు. మళ్ళీ అందరూ లోపలకి వెళ్ళిపోయారు.

"ఏమిటది మేష్టరూ" అని అడిగేడు సింహాద్రిరావు ప్రధానోపాధ్యాయుణ్ణి.

"ఎవడో తట్టుమీద పోతున్నాడండి." అన్నాడు.

"తట్టంటే" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"ఈ ప్రాంతాలలో ఈ చిన్నరకం గుర్రాలని తట్లు అంటారండి" అన్నాడు రెండో మేస్టరు.

"ఏమిటీ చిత్రం" అన్నాడు సింహాద్రిరావు.

"పూనా, సతారా ఆ వైపులనుంచి గుర్రాలని గుంపుగుంపులుగా తోలుకు వచ్చి, ఈవైపు అమ్ముతూంటారండి" అన్నాడు మూడో మేస్టరు.

సింహాద్రిరావు ఆశ్చర్యపడి వింటున్నాడు.

"ఈ అడవుల వెంట నడవలేక ఈ గుర్రాలని కొనుక్కొని, వాటిమీద వెళుతూంటారండి. పాపం గాజులు అమ్మేవాళ్లు, పొగాకు అమ్మేవాళ్లు మొదలైనవాళ్లు ఈ గుర్రాలమీదే వచ్చి గాజులు పొగాకు మొదలైనవి అమ్ముకొని పోతూంటారండి. వీటిని సామాన్యంగా గాజుల తట్లు అంటూంటారండి" అన్నాడు పెద్ద ఉపాధ్యాయుడు.

"ఏమిటీ ఇంకా చెప్పారు కాదు. ఈ అడివిలో అందరూ గుర్రపు రౌతులే అన్నమాట. బలే. ఏమి చిత్రమయ్యా" అని ముక్కుమీద వేలు వేసుకొన్నాడు సింహాద్రిరావు.

"దానికే ముందండి. దాని వీపుమీద కూర్చుంటే చంటి పిల్లాణ్ణికూడా అదే తీసుకు

టేకుమళ్ల కామేశ్వరరావు

పోతుంది" అన్నాడు రెండో ఉపాధ్యాయుడు తేలికగా.

"ఎంత తమాషాగా ఉందయ్యా! ఐతే మీరందరు కొస్తోకూస్తో ఎక్కేరన్న మాటే" అన్నాడు సింహాద్రిరావు.

"ఔనండి" అన్నాడు రెండో ఉపాధ్యాయుడు.

"అయ్యో బాబోయ్!" అని గుండెలమీద చెయ్యివేసుకొన్నాడు సింహాద్రిరావు చేతిలో వెలుగుతూన్న బీడీ మాటే మరిచిపోయి.

"అప్పుడప్పుడు తప్పదండి. దూరాభారం, నడవలేక వాటిమీద పోతూంటామండి" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు.

సింహాద్రిరావు కవ్వంతసేపు విస్తుపోయాడు. "గుర్రమంటే వెట్టిపనికిమాలిన జంతువన్న మాట! కాకపోతే ఇంతమందీ యెక్కితే ఇహ శేముందయ్యా దాని గౌరవం నా గౌరవమున్నూ. దాని కంటె కుక్క నయమన్న మాట. గాడిద మరీ నయం. బాగానే ఉంది. ఇంతవరకూ చెప్పేరు కాదేమయ్యా?" అన్నాడు సింహాద్రిరావు ముక్కులోంచి పొగ విడుస్తూ.

"ఇప్పుడు ఈ తట్టు కూడా మోసం వస్తూందండీ. పెద్దపులులు వాటిని బతకనియ్యకుండా ఉన్నాయండి" అన్నాడు రెండో ఉపాధ్యాయుడు.

"అదేమిటది!" అన్నాడు సింహాద్రిరావు భయాశ్చర్యాలతో నోరు తెరిచి.

ఈమధ్య రోజుకొక గుర్రం చొప్పున పెద్దపులొకటి నోటిలో వేసుకొంటూందండి. అంతా పది పదిహేను రోజులనుంచి. మొత్తంమీద పది పదిహేనుతట్లు నష్టపోయేరండి ఈ ఊరివాళ్లు పాపం!" అన్నాడు మొదటి ఉపాధ్యాయుడు విచారంతో.

"అదో ప్రమాదం కూడానుటయ్యా! ఇటు మనుష్యులని బతకనియ్యక, అటు గొడ్లని బతకనియ్యక, అటు అడివిలో నడిచి నడిచి చావలేక గుర్రాలమీద పోతూంటే వాటినీ బతకనియ్యక, ఇహ ఏలాగు చావడం వీటికోటి? అందరినీ చంపివేశాక ఆపేమి బతుకుతాయయ్యా! అందరినీ చంపివేసి ఆ దుర్యోధను డేమి పాముకొన్నాడయ్యా" అన్నాడు సింహాద్రిరావు చిక్కు మొహం పెట్టి.

"ఈ ఆవిడలో ఎవరినండి అడగడం!" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు.

"సరే కాని మేస్టరూ! బండికి మనకి ఋణం తీరింది" అన్నాడు సింహాద్రిరావు చల్లగా.

"ఇదేనండి బాబూ! అలాగంటున్నారు. ఫస్టుక్లాసయిన బండి, జోడు గుర్రాల బగ్గీలాంటి బండి సిద్ధంగా ఉందండి బాబూ!" అన్నాడు మేస్టరు.

"అబ్బే! నల్లమేకని బలిపేసినా కాలు అందులో పెట్టడమే. ఇహ ఎందుకు దానిగురించి మనకి ఆలోచన. లభించని దానిగురించి ఆలోచన ఎందుకయ్యా, వెర్రివాడా! అందని పండుని చూసి చెట్టు కింద పడుక్కుంటే మట్టుకు ఏమి ప్రయోజనం అని అడుగుతాను" అన్నాడు సింహాద్రిరావు.

అతనికి ఎదురు చెప్పడం ఇష్టంలేక ఉపాధ్యాయులు ఊరుకొన్నారు.

"ఎక్కడేనా ఒక గుర్రాన్ని అంకించుకు రావాలి నువ్వు. గత్యంతరం లేదు. నువ్వు బంగారం లాంటి బండిని తెచ్చి ఎదుట పెట్టినా ఇనుము లాంటి గుర్రాన్నె కాని నేను కన్నెత్తి చూడను" అన్నాడు సింహాద్రిరావు.

"బాబూ! గుర్రాలని బైటికి తియ్యడానికి ఊళ్ళో అందరూ జంకుతున్నారండి!" అన్నాడు రెండో మేస్టరు.

"ఏముందయ్యా వెధవ గుర్రం. ఇందాకే చెప్పేనుగా, గుర్రంకంటె కుక్క నయమని. ఒకమాటు ఎక్కి పారేసేదానికి! అదో బంగారమా ఏమిటి ఎమిటి యెత్తుకుపోటానికి! లేక అదో ఫలహారమా ఏమిటి తినేయ్యడానికి? కాఫీ యేనా కాదుగదా పోనీ తాగేస్తారని భయపడడానికి? ఇంతా చేస్తే వెధవ గుర్రం! చచ్చు గుర్రం" అన్నాడు. సింహాద్రిరావు గుర్రాన్ని ఎక్కాలన్న కోరిక బలం కాగా, మేస్టర్లకి అదొక పెద్ద ప్రయత్నం కాదనే భావం కలిగించడానికి.

"అయ్యా! గట్టి ప్రయత్నం చేస్తామండి" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు.

"నువ్వు తేవడమే నీ ప్రయత్నానికి నిదర్శనం. పంతులూ నువ్వు కూడా దీంట్లో తల దూర్చు!" అన్నాడు సింహాద్రిరావు పెద్ద మేస్త్రితో.

"చిత్తం బాబూ!" అని సమాధానమిచ్చేడు.

ఆ విషయమై కనుక్కోడానికి ఇద్దరు ఉపాధ్యాయులు వెళ్ళారు. ఏదైనా పని ఉంటుందని మూడో ఉపాధ్యాయుడు ఆగాడు.

నందకిశోరరావు బడి పరీక్ష తంతు ముగించుకొన్నాడు.

మిత్రులిద్దరూ కాఫీనీళ్లు రుచిచూస్తున్నారు.

"నిన్న కూడా ఈ ఊరు చేరేటప్పటికి చాలా పొద్దుపోయింది" అన్నాడు ఇన్స్పెక్టరు.

"తమకి చెప్పవలసిన అవసరం లేదనుకొని, అయినా ఈ అడవిలో ప్రయాణాలలో తమరు కొంచెం జాగ్రత్తగా ఉండాలి, రాత్రి ప్రయాణాలు చెయ్యవద్దండి బాబూ! సాయంత్రం పడేటప్పటికి ఏదో ఒక ఊరు చేరుకోవాలండి అయ్యా. ఏముందండి ఈ విధప అడవికి! ఎంత కావాలంటే మనకి" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు.

"ఆఁ సాయంత్రం పడేటప్పటికే పెద్ద పులులు విహారానికి బయలుదేరతాయంటావు! ఇన్నాళ్లూ ఒకళ్లూ చెప్పలేదేమిటయ్యా, ఇంత మందీ ఉండి. ఇప్పటికేనా నువ్వు బుద్ధిమంతుడివి కాబట్టి చెవిని పడవేశావు" అని సింహాద్రిరావు అతన్ని చాల మెచ్చుకొంటూ.

ఇంతటిలో ఆ వెళ్ళిన ఇద్దరు ఉపాధ్యాయులు తిరిగివచ్చారు.

"తమకి బండి సిద్ధంగా ఉందండి" అన్నాడు మూడో మేస్త్రరు ఇన్స్పెక్టరుతో.

"ఎద్దులేమిటి లెండి, బలే ఎద్దులు" అన్నాడు రెండో ఉపాధ్యాయుడు.

"నామాట ఏం చెప్పావు? రెండుకాళ్ళ రథం మీదేనా బయలుదేరి రావడం" అన్నాడు సింహాద్రిరావు మొదటి మేస్త్రరుతో.

"తమకి తట్టు సిద్ధంగా నే ఉందండి" అన్నాడు మొదటి మేస్త్రరు.

"అదేమిటయ్యోయ్" అని ఆశ్చర్యపోయాడు ఇన్స్పెక్టరు.

"ఇవాళ దొరగారు గుర్రంమీదే కాని బయలుదేరి రారుట. నాకూ ఇంతవరకే తెలిసింది" అన్నాడు సింహాద్రిరావు.

ఉపాధ్యాయులు పకపక నవ్వేరు.

"ఇదొకటి తెచ్చిపెట్టేవు" అన్నాడు ఇన్స్పెక్టరు.

"దొరగారంటే ఏమిటనుకొంటున్నావు. మన్నెమంతటికీ రాజాగారన్న మాట" అన్నాడు సింహాద్రిరావు.

"ఏకేం మహారాజులవి. ఎన్ని అనుభవించాలో అన్నీ అనుభవించు" అన్నాడు ఇన్స్పెక్టరు.

"గుర్రంమీద నేను ఎంత సేపటిలో వస్తాను. ఇదిగో ఇలాగ చిటిక వేసేటప్పటికి వచ్చి చేరుకొంటాను. అంచేత ముందట నువ్వు బయలుదేరు" అన్నాడు సింహాద్రిరావు ఇన్స్పెక్టరును.

"సరే అయితే!" అని నందకిశోరరావు బండి ఎక్కాడు. ఇద్దరు మేస్త్రులు వెంట నడుస్తున్నారు.

గుర్రాన్ని చూశాడు సింహాద్రిరావు. అది చిన్నది. ఎర్రగా ఉంది. కూర్చున్నప్పుడు కాస్త మెత్తగా ఉండడానికని దానిమీద ఒక గోనె పడవేశారు. అటు ఇటు రికాబులు ఉన్నాయి. నోటిలో కళ్లెము; దానికి అటు ఇటు చేంతాళ్లు కట్టారు. పక్కని గుర్రపువాడు ఉన్నాడు.

"గుర్రంమీద తమరు ఎక్కండి" అన్నాడు ఉపాధ్యాయుడు.

"అబ్బే! అలాగు ఎక్కుతారా! తప్పుకాదూ, మర్యాద పోదూ" అన్నాడు సింహాద్రిరావు బుర్ర అడ్డంగా ఆడిస్తూ, నాలుక సగం బైట పెట్టి పళ్ళతో నొక్కుతూ.

"ఎగిరి ఎక్కండి బాబూ!" అన్నాడు పంతులు.

"అంతే!" అన్నాడు సింహాద్రిరావు.

"ఇలాగు" అని గుర్రపువాడు రికాబులో పాదం పెట్టి, ఎగిరి దాని వీపుమీద కూర్చుని మళ్ళీ దిగిపోయాడు.

"ఆ పప్పులన్నీ మన దగ్గిర ఉడకవు! చక్కగా తీసుకువెళ్ళి దాని పక్కన ఒక కుర్చీయో, స్టూలో పడవెయ్యండి దొరగారికి దగ్గరగా ఎక్కుతారు. అంతే కాని అలాగు దొమ్మరి ఎగరులు ఎగిరితే మర్యాద ఎక్కడేనా ఉంటుందటయ్యా ఈ అడివిలో" అన్నాడు సింహాద్రిరావు.

"సరేకదా" అని కుర్చీ తెచ్చి వేశాడు పంతులు. దానిమీద అడుగువేసి, అవతలవైపు నుంచి పంతులు చెయ్యి సాయం చెయ్యగా, సింహాద్రిరావు సాహసించి, గుర్రం వీపుమీదికి యెక్కి, రెండు చేతులతోను దాని చెవులు గట్టిగా పట్టుకొన్నాడు. మీదనున్న బరువు సర్దుకోడం కోసం గుర్రం అటు ఇటు కదలగా అతను ఆసామితో "ఏమయ్యా! మీ గుర్రానికి స్వారి కొత్తకాదు కదా" అని ప్రాణాలు బిగబట్టుకొంటూ అడిగాడు.

"లేదు బాబయ్యా! మేకలాంటి జంతువండి. చిన్నపిల్లలు సైతం ఎక్కి, జువ్వలు తీసుకొని బాది, దౌడు తీయిస్తూ, ఆడుకొంటూంటారండి బాబయ్యా" అన్నాడు ఆసామి.

"మా ఊళ్లో కూడా చాకలి గుర్రాలని ఒక రకంవి ఉంటాయిలే. వాటిమీద కూడా కుర్రవాళ్లు యెగిరి యెక్కి కూర్చొని, పరుగెత్తిస్తూంటారులే. దీనికంటె అవే మెరుగనుకొంటాను. గుర్రమంటే యింత పెద్దదయితే ఎలాగయ్యా. చిన్నపిల్లలు చూశావూ అక్క గుర్రాలమీద అటు ఇటు కాళ్ళు వేసుకొని కూర్చొని ఊగులాడుతూంటారు. అంతదిగా ఉంటే ఎంత బాగుంటుందో ఆలోచించు" అన్నాడు సింహాద్రిరావు.

"నేనెప్పుడూ చూడలేదండి బాబుగారూ" అన్నాడు ఆసామి.

"నువ్వెక్కడి మనిషివయ్యా? అడివిమనిషిలాగున్నావు! చూడలేదుటయ్యా! దాని నెక్కి పిల్లలు ముందుకి వెనక్కి ఊగులాడుతూంటారు. చక్కగా అక్కరంగులు వేసుంటాయి. అవి మద్రాసు నుండి దిగుమతి అవుతాయిలే. అటువంటివి యెక్కడమంటే నాకు మహా చెడ్డ సరదా అనుకో. ఇంతకీ దీని రంగు చూశావూ, కంకరమట్టిలో పొర్లినట్లు వెధవరంగూ ఇదీను. దానికి పంచరంగులు వేసుంటాయి. చేతిలో పని — మొత్తంమీద ఈ గుర్రం మంచిదేనంటావు" అన్నాడు సింహాద్రిరావు.

"తమరే చూస్తారు కదూ బాబయ్యగారూ" అన్నాడు గుర్రపువాడు.

"మంచిదేనండి అయ్యగారూ" అని బలపరిచేడు పంతులు.

గుర్రపువాడి చేతిలో కళ్లెముంది. సింహాద్రి గుర్రం చెవులు గట్టిగా పట్టుకోగా, గుర్రం చెవులు దులుపుకొంటూంది. అది చూసి గుర్రపువాడు "బాబయ్యా చెవులు పట్టుకోకండి చిరాకుపడుతుంది" అన్నాడు.

"ఈ పీనుగకి అనొక దుర్లక్షణముందా! అబ్బే, చెవులు గట్టిగా ఉన్నాయో మెత్తగా ఉన్నాయో, దాని చెవులకి మన చెవులకి భేదమేమిటో అని పట్టి చూస్తున్నాను అంతే కాని మరేం లేదులే. నువ్వు శాస్త్రం చదువుకోలేదేమిటి రాతూ" అని ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"మా మొహాలకి చదువొకటండి బాబయ్యా! అడవులలో కొండలలో పడి తిరిగేవాళ్ళం" అన్నాడు ఆసామి

"'ఎరిగియుం బిరుసైన హయము నెక్కకుసుమతీ!' అన్నాడు శాస్త్రకారుడు. అందుకని దీని చెవులు మెత్తగా ఉన్నాయో గట్టిగా ఉన్నాయో అని పట్టిచూస్తున్నాను అంతే" అన్నాడు సింహాద్రిరావు. కాని అందువల్ల ఏమి ప్రమాదముందో అని ఒక చెవిని మాత్రం విడిచిపెట్టి, పంతులు అందించిన జువ్వను ఆ చేతితో అందుకొన్నాడు. అతని గుండె బితుకు బితుకులాడుతూంది.

"దీనికి చెవుడుగాని గుడ్డిగాని లేదు కదా అబ్బీ" అన్నాడు సింహాద్రిరావు.

"లేదు బాబయ్యా" అని గుర్రపువాడు జవాబు చెప్పాడు.

గుర్రం లెక్కపెడుతూన్నట్లుగా అడుగులు వేస్తూంది. కొట్టడానికి జంకి సింహాద్రిరావు జువ్వ ఉట్టినే చేతితో పట్టుకొన్నాడు. అతను "హై-హై పట్టి గెంతలాగు అడగులు వేస్తూందేమిటయ్యా" అని రికాబున్న మనమతో గుర్రాన్ని పొడిచేడు.

గుర్రం పరిశీలిస్తూంది. స్వారిచేస్తూన్న మనిషికి ఏమీ చేతకాదని అది ఇట్టే పోల్చివేసింది. సమయంకోసం చూస్తూంది. దారిలో చిన్న కాలవ వచ్చింది. కాలవగట్టుమీదనుంచి గుర్రం అడుగులో అడుగు వేసుకొంటూ దిగింది. అది చిత్రంగాకనబడింది సింహాద్రిరావుకి. నీళ్లలోనూ అలాగే జాగ్రత్తగా నడిచింది. నెమ్మదిగా

గట్టెక్కింది. సింహాద్రిరావు "నీళ్ళంటే హడిలి చస్తుందేమిటయ్యా నీ గుర్రం? డెక్కలు మునగని నీటిలో పీక మునిగి చస్తానని భయపడుతుందేమిటయ్యా" అన్నాడు.

'భయపడడం కాదండి బాబూ' అన్నాడు ఆసామి.

"మరి అయితే?"

"నేలవాలు ఎత్తు ఉన్నప్పుడూ, ఒక వేళ నీటిలో గోతులుంటాయనీ—పైన కూర్చున్న మనిషికి ఒళ్ళు కదలకుండా ఉండడానికి, నెమ్మదిగా అలాగు అడుగులో అడుగు వేసుకొంటూ, జాగ్రత్తగా నడుస్తుందండి బాబూ!" అన్నాడు గుర్రపువాడు.

"అమ్మో! తెలివైన ఘటమన్న మాటే. ఏమిటో అనుకొన్నాను. అయితే నాకంటే మెరుగే అంటావు." అన్నాడు సింహాద్రిరావు.

"ఏలినవారికేమి మహారాజులు" అన్నాడు ఆసామి.

"సరేకాని అబ్బాయీ! ఆ కళ్ళెం నాచేతికి ఒక్కమాటు అందియ్యి. నా తడాఖా చూపిస్తాను" అన్నాడు సింహాద్రిరావు.

"సిత్తం బాబయ్యగారూ" అని రౌతు సింహాద్రిరావుని చూసి, గొప్ప ప్రభువని బెదురుతూ చేతికి సాహసించి కళ్ళెం అందించాడు. ఇచ్చి ఇయ్యడంతో గుర్రం ఒక గంతు వేసింది. సింహాద్రిరావు కెవ్వుమని కేకవేశాడు. గుర్రం దౌడుతీసింది. పెద్ద అరుపులు అరుస్తూ అతను దాని జూలు రెండు చేతులతో గట్టిగా పట్టుకొన్నాడు. కాని గుర్రం వీపుమీదనుంచి పక్కకి జారిపోతున్నాడు. అయినా చేతులు పట్టు విడిచిపెట్టలేదు. కంగారుపడగా చేతులలోంచి జూలు పట్టు వదిలిపోయింది. దబ్బున నేలమీదపడ్డాడు. మేస్టరు గుర్రపువాడు కేకలు వేసుకొంటూ అతని వెంట పడ్డారు. అక్కడ ఇసక ప్రాంతంగా ఉండబట్టి సింహాద్రిరావు బతికేడు. లేకుంటే స్వర్గలోకాన్ని చేరుకోవలసిందే! పంతులువచ్చి అతన్ని లేవతీశాడు. "నా గుర్రమో—పెద్ద పులో—నా గుర్రమో పెద్ద పులో" అంటూ గోలపెడుతూ గుర్రపువాడు గుర్రాన్ని వెదుక్కోడానికి అడివి వెంట పడ్డాడు.

సింహాద్రిరావు ఓపిక తెచ్చుకొని నిల్చుని "ఇలాంటి వెధవ గుర్రాన్ని తెచ్చేవేమిటయ్యా!" అన్నాడు కోపంతో పంతులతో. అతని ఒంటినున్న ఇసక దులుపుతూ పంతులు "చిత్తం బాబయ్యాగారూ!" అన్నాడు విచారిస్తూ.

"నువ్వు మొదట దాన్ని ఎక్కి చూశావా? నాకా సంగతి చెప్పాదూ మొదట" అన్నాడు సింహాద్రిరావు తీవ్రంగా.

"లేదు బాబయ్యా!"

"ఇంకేమి! అలాగు చెప్పుమరి. పెద్ద మనుషులతో వ్యవహారమని తెలుసుకోవద్దుటయ్యా. ఏమి వచ్చినా ముందు మర్యాద పోతుందికదా! తెచ్చేముందు ఒక్కమాటు ఎక్కి, మంచిచెడ్డా చూసి మరీ తేరుటయ్యా" అన్నాడు.

"చిత్తం బాబయ్యా! అడివిలో దేనినికూడ నమ్మడానికి లేదండి!" అన్నాడు మేస్టరు భయభక్తులతో.

"మరి నీ మాట కూడా అంటేనంటావా!" అన్నాడు సింహాద్రిరావు.

"మీ చేతులలో కీలు బొమ్మలమండి తండ్రిగారూ!" అని చేతులు నులుపుకొన్నాడు మేస్టరు.

"కీలు గుర్రమంటే ఇంకొసరిగా ఉంటుంది పంతులు!" అని సింహాద్రిరావు మెరుగుపెట్టాడు.

"చిత్తం బాబూ! తమ మాటేనండి" అన్నాడు మేస్టరు.

గుర్రం పరుగెత్తుకొంటూ ఆ రోజానే వస్తూంది. ఇన్స్పెక్టరు, మేస్టర్లు ఆశ్చర్యపోయేరు. సింహాద్రిరావుని కింద పడవేసి, గుర్రం ఊడాయించి ఉంటుందని ఊహించుకొన్నారు.

"అయ్యో, పాపం! యెంత పనయింది!" అని విచారిస్తూ ఇన్స్పెక్టరు బండిని ఆపుచేశాడు. ఒక ఉపాధ్యాయుడు కొంచెం దూరం వెనక్కి వెళ్ళి, దోవమళ్ళుపు తిరిగి చూడగా, సింహాద్రిరావు, పంతులు నడిచి వస్తూన్నట్లు కనబడింది. అతను సంతోషించి, సింహాద్రిరావుకీ, పంతులుకీ "చప్పున రండి! చప్పున రండి" అని కేకలువేసి, చప్పట్లు కొట్టాడు. ఇంకా బండి దూరం వెళ్ళనందుకు సింహాద్రిరావు యెంతో సంతోషించేడు. వాళ్ళు గబగబ వచ్చి, తక్కినవాళ్ళని కలుసుకొన్నారు. జరిగిన

ఘటనంతా విని అందరూ వచ్చే నవ్వు ఆపుకొన్నారు. వాళ్ళ నవ్వుని గ్రహించి సింహాద్రిరావు మూతి ముడిచిపెట్టుకొని "నవ్విన వాళ్ల పళ్లే బైటపడతాయి. నాకేమి, పో"మ్మనుకొని "ఈ అడవిలో మూడోగండం గడిచి, బతక బైటపడ్డందుకు భగవంతుడికి వెయ్యి నమస్కారాలు" అంటూ మనస్సులో దండాలు పెట్టుకొన్నాడు. అతను బండిని యెక్కనని చెప్పి నడక సాగించాడు, మరికొంత సేపటికి ఊరు దర్శనమయింది. ఇంకా చాలా పొద్దుండగానే అందరూ 'వంకరాయి' చేరుకొన్నారు.

మద్రాసులో మంత్రివర్గం

# వివిధ పార్టీల దృక్పథాలు

ఒక పరిశీలకుడు

మద్రాసు రాష్ట్రంలో మంత్రివర్గ నిర్మాణ సూచనలు కనుచూపు దూరంలో ఎక్కడా కనపించటం లేదు. అన్నిటికంటే పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ మడి కట్టుకుని కూర్చుంది. కొన్ని కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలు మంత్రి వర్గాన్ని యేర్పాటు చేయాలని తలక్రిందుగా తపస్సు చేస్తున్నాయి. కాని ప్రభుత్వాధికార సాక్షాత్కారం కలిగే సూచన లేమీ లేవు. చివరకు గవర్నరు పాలన తప్పదేమో.

నేటి రాజకీయ అరాజకానికి కారణం మన రాష్ట్రంలోని రాజకీయ పార్టీల పుట్టుకలోనే ఉంది. రెండు మూడు పార్టీలకు సిద్ధాంతరీత్యా భేదమేమీ లేదు. అయినా యివి తమలో తాము తీవ్రంగా పోటీ పడినయ్. ఇక ఎన్నికలలో చేయి కలిపిన పార్టీలకు సిద్ధాంతరీత్యా పోలికే లేదు. అయినా ఇవి పరస్పరం బలపరుచుకోటం (కొన్నిచోట్లే!) జరిగింది. ఒకచోట ఎన్నికల మైత్రి నెరపిన పార్టీలే మరోచోట తీవ్రంగా పోటీ పడినయ్. ఇలా మన రాష్ట్ర రాజకీయాలు చక్కని ప్రహసనాలుగా తయారయినయ్. ఎన్నికలు జరిగినంతకాలం యివి వినోదాన్ని కలిగించినయ్. కాని తరువాత విషాదం కలిగిస్తున్నయ్.

ఇంతకూ పిల్లికి యెవరు గంట కట్టాలో తేల లేదు, కాంగ్రెసు పందికొక్కు, రెండు మూడు చిట్టెలుకలను కూడగట్టుకుని ప్రయత్నం చేస్తే నెగ్గే అవకాశముంది. కాని అది మంకుపట్టు పట్టింది. "ఈ చిట్టెలుకలు నాతోపాటు వాటి కాళ్ళమీద అవి నిలబడతామంటే వీలు లేదు. అవి నా పొట్టలో దూరి నేను యింకా ఉబ్బేటట్లుగా చేస్తేనేగాని ముందుకురాను"అంటున్నది. మరోవైపున నాలుగైదు చిట్టెలుకలు కట్టకట్టుకొని ముందుకు రావాలని చూస్తున్నాయి కాని అన్నిటి కాళ్లు ఒకే దిక్కుగా నడవటం అసాధ్యంగా ఉంది. ఇదీ స్థితి.

ఎలాగైనా మంత్రివర్గం యేర్పాటు చేయాలని కమ్యూనిస్టులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

కాని వీరితో కలిసి మిశ్రమ మంత్రివర్గ స్థాపన చేయగోరే పార్టీలు బాగా ఆలోచించుకొని మరీ అడుగు వేయవలసి ఉంది. కమ్యూనిస్టులకు ప్రజాస్వామ్య విధానంలో విశ్వాసం లేదు. వీరు మంత్రివర్గాన్ని యేర్పాటు చేసేది ప్రజాస్వామికాన్ని పదిల పరచేందుకు మాత్రం కాదు. ప్రజాస్వామ్య విధానం కుదుటపడితే వారి కార్మిక నియంతృత్వస్థాపనకు అవకాశమే ఉండదు. ఇక ప్రజా పార్టీ ఆదిగా గల వారికి యీ ప్రజాస్వామిక వ్యవస్థలో విశ్వాసమున్నది. ఇది రక్షింపబడాలనే వీరు అంటున్నారు. ఈ పరస్పరవ్యతిరేక ఆశయాలు కలవారికి పరిపాలనా నిర్వహణలో పొత్తు కుదరటం అసంభవం. ఈ మిశ్రమప్రభుత్వం ఏర్పడినది లగాయతు కమ్యూనిస్టులు యీ ప్రజాస్వామికవ్యవస్థ పనికిమాలినదని, దీన్ని కూలద్రోయవలసిన అవసరం ఉన్నదని ప్రజలకు